క్లుప్తంగా

ప్రాచ్య పరిశోధన సంస్థను సందర్శించిన కమిటీ



తాళపత్ర గ్రంథాలను పరిశీలిస్తున్న అకౌంట్స్ కమిటీ

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని ప్రాచ్య పరిశోధన సంస్థను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పి.రామాంజనేయుల బృందం బుధవారం సందర్శించింది. సంస్థలో ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, కాగిత ప్రతుల్లో నిక్షిప్తం చేసిన జ్ఞాన సంపదను, లిపులు మొదలైన వాటి గురించి సంస్థ సంచాలకులు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో ఈతాళపత్రాల గొప్పదనాన్ని తెలుసుకునే వీడియో రూపొందించాలని సంచాలకులకు సూచించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు నక్కా ఆనందబాబు, విష్ణుకుమార్ రాజు, రామాంజనేయులు, వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పాల్గొన్నారు

శ్రీవారి సేవలో ఉత్తరాదిమఠ పీఠాధిపతి



ఆలయం లోపల ధ్వజస్తంభం వద్ద సత్యాత్మ తీర్థ స్వామీజీతో టీటీడీ అధికారులు

తిరుమల: తిరుమలేశుని బుధవారం ఉత్తరాదిమఠ 1008వ పీఠాధిపతి సత్యాత్మ తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. తిరుమల జేఈఓ ఆంజనేయస్వామి వద్ద స్వామీజీకి టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, ఆలయ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్, పేష్కార్ రామకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే, సినీ నటుడు నారా రోహిత్, రచయిత కోన వెంకట్ సైతం వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులువారికి ఆశీర్వచనం పలికారు.

పీజీ విద్యార్థులకు చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న జెట్ అకాడమి ఎన్ఆర్ఐ శ్యామ్ సుందర్

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫిలాసఫీ విభాగంలో అడ్మిషన్లు పొందిన పేద విద్యార్థులు శ్రీలక్ష్మి, పెంచల కొండయ్యకు ఫీజుల కోసం మదనపల్లెకు చెందిన జెట్ అకాడమి ఎన్ఆర్ఐ శ్యామ్ సుందర్ రూ.22వేలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం ఫిలాసఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం చంద్రయ్య, కంప్యూటర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ అంజన్ బాబు సమక్షంలో విద్యార్థులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సహఆచార్యులు జయరామయ్య, జెట్ అకాడమి కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రుయాకు వీల్ చైర్ల వితరణ



చక్రాల కుర్చీలను అధికారులకు అందజేస్తున్న రమాదేవి

తిరుపతి తుడా: స్థానిక రుయా ఆస్పత్రికి రేణిగుంటకు చెందిన దగ్గుపాటి రమాదేవి తన కుమారుడి జ్ఞాపకార్థం దాదాపు రూ.లక్ష విలువ చేసే 12 చక్రాల కుర్చీలను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, అధికారులను అందజేశారు. ఆమెను అధికారులు అభినందించారు.

తీరనున్న తుమ్మలగుంట దాహార్తి



బోరు వేస్తుండగా వస్తున్న నీరు

తిరుపతి రూరల్: మండలంలో తుమ్మలగుంట దాహార్తి తీరనుంది. కొంత కాలంగా నీళ్ల కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు అభ్యర్థన మేరకు బోరు వేయడానికి మండల పరిషత్ సాధారణ నిధులను ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి విడుదల చేశారు. బుధవారం గంగమ్మ ఆలయ సమీపంలో బోరు వేశారు. పుష్కలంగా నీళ్ల పడటంతో గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

క్రిమినల్ చర్యలు చేపట్టాలి

తిరుపతి కల్చరల్: విద్యార్థుల నుంచి అక్రమంగా కోట్లాది రూపాయల ఫీజులను అదనంగా వసూలు చేసిన మోహన్‌బాబు వర్సిటీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ఎంబీయూ ఎక్కువగా వసూలు చేసినట్లు ఆడిట్ నివేదికల్లో రుజువైందని, వసూలు చేసిన ఫీజుల సమాచారాన్ని కమిషన్‌కు వెల్లడించలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరే ప్రైవేటు వర్సిటీల యాజమాన్యాలు తప్పులు చేయకుండా కట్టడి చేయాలని కోరారు.

బార్లను తలపిస్తున్న మద్యం షాపులు!

రహదారికి ఆనుకుని ఉన్న మద్యం దుకాణం



మద్యం సేవించేందుకు అనధికారికంగా ఏర్పాటు చేసిన ప్రాంతానికి వెళ్తున్న మందుబాబులు



మండలంలో మద్యం షాపులు మినీ బార్లను తలపిస్తున్నాయి. మద్యం ప్రియులను నిర్వాహకులు విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. మద్యం షాపుల పక్కన కిరాణా కొట్లలో నాసిరకం తినుబండారాలు, వాటర్ బాటిళ్ల అమ్మకాలు.. వెనుక సిట్టింగ్ సఫారుల్లో ఎంచక్కా బాతాఖానీ కొడుతూ మందు కొట్టేందుకు ఏర్పాట్లు చేయడం, మరోవైపు విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఉండడంతో మద్యం ఏరులై పారుతోంది. అంతేకాకుండా మద్యం షాపులన్నీ ప్రధాన రహదారులకు ఆనుకుని ఏర్పాటు చేయడంతో మందుబాబులు మద్యం మత్తులో రోడ్లపై వీరంగం చేస్తున్నారు. వీరి ధాటికి మహిళలు, వాహనచోదకులు హడలిపోతున్నారు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి మందుబాబుల ఆగడాలు, బెల్ట్ షాపులు, సిట్టింగ్ సఫార్లకు చెక్ పెట్టాలని కోరుతున్నారు. - రామచంద్రాపురం



గామాల్లో బెల్ట్‌షాపులో మద్యం సేవించి రోడ్డు పక్కనే మత్తులో పడిపోయిన మందుబాబులు

ఘనంగా విత్తనాల దినోత్సవం



మాట్లాడుతున్న రీసెర్చ్ డైరెక్టర్ తడాక్టర్ సుమతి

చంద్రగిరి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం విత్తనాల దినోత్సవాన్ని రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సుమతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విత్తన ప్రాముఖ్యత, ఆవశ్యకత గురించి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే.జాన్, వేరుశనగ విత్తనోత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెలకువలు గురించి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి. రూపేష్ కుమార్‌రెడ్డి, అలాగే చీడపీడలు, వాటి నివారణ చర్యలను తెగుళ్ల విభాగానికి చెందిన శాస్త్రవేత్తలురైతులకు వివరించారు. మినుము, పెసర, కంది పంటల సాగులో రకాల ఎంపిక, రాగి, సజ్జ, కొర్ర సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను తెలిపారు. అనంతరం మినుము, అలసంద, అనప, రాగిలో మేలైన వివిధ రకాల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మురళీకృష్ణ, కే.విశ్వనాథ్, డాక్టర్ వై. అమరావతి, డాక్టర్ ఎం.శాంతిప్రియ, డాక్టర్ పి.మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ పేరుతో క్రాకర్స్ విక్రయాలపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్

తిరుపతి కల్చరల్: టీటీడీ పేరుతో కొందరు ఆ సంస్థ ఉద్యోగులు ప్రతి ఏటా క్రాకర్స్ విక్రయాలతో సొమ్ము చేసుకుంటున్నారని, దీనిపై టీటీడీ విజిలెన్స్ విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చీనేపల్లి కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు టీటీడీ ఉద్యోగులు టీటీడీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లైసెన్స్ పొంది 2005 నుంచి క్రాకర్స్ అమ్మకాలతో ఆదాయం పొందుతున్నా టీటీడీ ఉద్యోగులకు రాయితీ ఇవ్వడం లేదన్నారు. ఇదే కోవలో ప్రతి ఏటా బాణసంచా విక్రయాలు చేసే ఎస్వీయూ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ తక్కువ ధరలకే ఎస్వీయూ ఉద్యోగులకు ఇస్తోందన్నారు. కో-ఆపరేటివ్ స్టోర్స్ లైసెన్స్ పొందిన టీటీడీ ఉద్యోగులు మాత్రం జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. కనీసం జీఎస్టీ చెల్లిస్తున్నారా? అని ప్రశ్నించారు. సమావేశంలో సురేష్ నాయక్, నాగులు పాల్గొన్నారు.

కౌశల్ సైన్స్ టెస్ట్‌పై అవగాహన



విద్యార్థులతో హెచ్ఎం సుమలత, సమన్వయకర్త వెంకట సిద్ధులు

పాకాల: మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు బుధవారం కౌశల్ సైన్స్ టెస్ట్‌పై సమన్వయకర్త వనపర్తి వెంకట సిద్ధులు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగిన శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ టెస్ట్ నిర్వహిస్తారని, ఈ పోటీ పరీక్షలు క్విజ్, రీల్, పోస్టర్ ప్రజెంటేషన్.. ఇత్యాది అంశాల ద్వారా పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మూడు దశల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు ఇస్తారని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సుమలత, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

లీకేజీకి చెక్

సాక్షి ఎఫెక్ట్..

రామచంద్రాపురం: మండలంలోని గొల్లపల్లె వాటర్ ట్యాంకు బాగుపడింది. లీకేజీని అరికట్టి, ట్యాంకు చుట్టూ శుభ్రం చేశారు. ఇక్కడ నెలల కాలంగా లీకేజీతో మంచినీళ్లు వృథా అవుతుండడంపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'లీకేజీతో అధ్వానం' శీర్షికతో ప్రచురించిన కథనంపై సర్పంచ్ చిరంజీవి రెడ్డి స్పందించారు. పంచాయతీ సిబ్బందితో బుధవారం లీకేజీలను అరికట్టి, మరమ్మతులు చేయించారు.



వాటర్ ట్యాంకు లీకేజీకి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అంగన్‌వాడీలో ఆరోగ్యసూత్రాలు పాటించాలి

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ స్కూళ్లలో కూడా వర్కర్లు, హెల్పర్లు సమష్టిగా ఆరోగ్యసూత్రాలను పాటించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వసంత బాయి అన్నారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మాట్లాడారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల స్వచ్ఛతకు సంబంధించి కేటాయించిన అవార్డుల్లో ఐదు అంగన్‌వాడీ స్కూళ్లకు వచ్చాయని, వీటిలో గూడూరులోని అశోక్‌నగర్-2 అంగన్‌వాడీ స్కూల్, చిన్నగొట్టిగల్లు, వెంకటగిరి మండలంలోని కలవలపూడి, తొట్టంబేడు మండలంలోని కాసరం, దొరవారిసత్రం మండలంలోని నెలబల్లి అంగన్‌వాడీ కేంద్రాలకు అవార్డులు రావడం మరింత బాధ్యత పెంచిందన్నారు. జిల్లాలోని 11 ప్రాజెక్టు పరిధిలోని సీడీపీవోలు ప్రతి కేంద్రాన్నీ తనిఖీ చేయాలని ఆదేశించారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు.

అధికారుల కోసం పడిగాపులు

రామచంద్రాపురం: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు సమయపాలన పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉదయం ఆలస్యంగా 11 గంటలకు తెరిస్తే, సాయంత్రం 4 గంటలకే గేట్లు వేసి వెళ్లిపోతున్నారని ప్రజలు చెబుతున్నారు. బుధవారం వివిధ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. తహసీల్దార్ లేకపోవడంతో ఆయన కోసం నిరీక్షించారు.

ఎంబీయూపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న శివారెడ్డి

తిరుపతి కల్చరల్: మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో ఫీజుల కుంభకోణంపై తక్షణం సిట్ విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంబీయూ ఫీజుల కుంభకోణంపై ఆంధ్రప్రదేశ్ ఫీజు నియంత్రణ మండలి తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీలో పని చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులను యధావిధి కొనసాగించాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నేతలు నారాయణ, శ్రీను, ప్రవీణ్‌కుమార్, వరప్రసాద్, అహ్మద్, ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ అసోసియేషన్ నేత నందకిషోర్ పాల్గొన్నారు.

ఎస్వీయూకు పూర్తి స్థాయి వీసీని నియమించరూ!

●పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌కు విద్యార్థి సంఘాల వినతి



పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ: ఎస్వీయూకు పూర్తిస్థాయి వీసీని నియమించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం వర్సిటీని సందర్శించిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ రామాంజనేయులుకు వినతిపత్రం ఇచ్చి విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడారు. రెండేళ్లు గడిచినా ఎస్వీ యూనివర్సిటీకి పర్మినెంట్ వైస్ చాన్సలర్‌ను నియమించకపోవడం సిగ్గుచేటని, ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని విమర్శించారు. వీసీతో పాటు ఖాళీగా ఉన్న రెక్టార్ పదవిని ఎస్సీ వర్గానికి కేటాయించాలని, అలాగే నాన్ టీచింగ్ (డీఈ) పదవిని తక్షణమే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు మన్నం ప్రేమ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి హెచ్. లోకేష్, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ముని, ఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు హరినాయక్, విద్యార్థి నాయకులు మహేష్, లిఖిత్, సాయి, పూర్ణరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోండి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ప్రతి నెలా ఉద్యోగులకు వేతనాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నాన్‌టీచింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు బుధవారం పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ, వేతనాలు సరైన సమయంలో అందకపోవడంతో ఉద్యోగులు ఈఎంఐలు, బ్యాంకు రుణాలు కట్టలేక అపరాధ రుసుంతో చెల్లించాల్సిన పరిస్థితి కలుగుతోందని ఆవేదన వ్యక్తం చుశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీరో వన్ జీరో (010) బడ్జెట్ కింద జీతభత్యాలు ఇస్తున్నారని, అదే తీరులో వర్సిటీ ఉద్యోగులకు కూడా ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ గుర్రంకొండ, సెక్రటరీ ఎస్ సుబ్రమణ్యం, సభ్యులు ఉన్నారు.

జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు



జర్నలిస్ట్ కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: ఎస్ఆర్ శంకరన్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలపై దృష్టి సారించిన అధికారులు బుధవారం ఆ కాలనీలో పర్యటించారు. సమస్యలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పాత్రికేయులు కమిషనర్‌కు వివరించారు. దీనిపై కమిషనర్ పైవిధంగా స్పందించారు. పెద్ద కాలువలో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ మూర్తి, డీఈలు రమణ, శిల్ప, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



సదస్సులో వీసీ ఉమ, అధ్యాపకులు, విద్యార్థినులు

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్, సైకాలజీ విభాగాలు మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మానసిక ఆరోగ్యంపై రెండ్రోజుల అవగాహన కార్యక్రమం ఇంజినీరింగ్ కాలేజీలో ప్రారంభించారు. వర్సిటీ వీసీ ఆచార్య వెన్నం ఉమ మాట్లాడారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. ప్రతికూల అనుభవాలు, పరిస్థితులు, ఒత్తిళ్లు, వివిధ సమస్యలు మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ పరిస్థితులను అధిగమించడానికి మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య రజని మాట్లాడుతూ, మానసిక, శారీరక ఆరోగ్యం బాగా ఉండడానికి సమతుల్య, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిమ్‌హాన్స్(బెంగళూరు) ప్రొఫెసర్ శేఖర్ మానసిక దృఢత్వంపై మాట్లాడారు. రిసోర్స్ పర్సన్ ఎం. సంజయ్, వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బంగారు పతకం విజేతకు అభినందన



వరుణ్యను అభినందిస్తున్న కోచ్, పాఠశాల డైరెక్టర్

తిరుపతి కల్చరల్: శాంతినగర్‌కు చెందిన నటుడు జీవన్ కుమార్తె వరుణ్య(8వ తరగతి) ఈనెల 6న జిల్లా స్థాయిలో జరిగిన అండ్-14 విభాగం తైక్వాండో పోటీలలో ప్రతిభచాటి బంగారు పతకం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని కోచ్ బాలక్రిష్ణ, బెల్లం కొండ సురేష్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిన్నారి వరుణ్యను అభినందించి మాట్లాడారు. పాఠశాల యాజమాన్యం సహకారం, కోచ్ శిక్షణతో తాను బంగారు పతకం సాధించగలిగానని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించాలన్నదే తన లక్ష్యమని వరుణ్య తెలిపింది. సమావేశంలో గీతాంజలి స్కూల్ డైరెక్టర్ ఎస్.మాధవి, వరుణ్య తల్లి ద్రాక్షాయణి, నాని పాల్గొన్నారు.

చైనా దేశస్తుడిని ఈడీ అధికారుల విచారణ

రేణిగుంట: రేణిగుంటలో ఉంటున్న ఓ చైనా దేశస్తుడి ఇంట్లో బుధవారం రాత్రి ఈడీ అధికారులు సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. గురవరాజు పల్లి సమీపంలోని శ్రీకాళహస్తి రహదారి పక్కన ఉన్న భవనంలో చైనాకు చెందిన డ్యూయాంగస్ ఉంటున్నారు. బుధవారం అతన్ని అదుపులోకి తీసుకుని ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. బిగ్ కిచెన్ పేరుతో చైనా సంస్థల్లో పనిచేసే చైనీయులకు ఆహారం సరఫరా చేసేవాడని తెలుస్తోంది. వీసా నిబంధనలను ఉల్లంఘించడం, వివిధ కంపెనీల పేరుతో వ్యాపారాలు నిర్వహిస్తూ పన్నులు చెల్లించకుండా ఉండడంతో, ఢిల్లీ, చెన్నై నుంచి వచ్చిన ఈడీ అధికారులు యాంగస్ నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసింది. ఈ క్రమంలో ఏర్పేడు మండలం వికృతమాలలో డ్యూయాంగస్ నిర్వహిస్తున్న స్క్రాప్ గోదాములో సైతం ఈడీ అధికారులు సోదాలు చేశారు. అదేవిధంగా రేణిగుంటలోని అతడి ఇంటి వద్దకు బ్యాంకు అధికారులను పిలిపించి విచారించినట్లు తెలిసింది. 2021 సంవత్సరంలో ఇతనిపై రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో వీసా ఉల్లంఘన, ఫోర్జరీ, అనధికారికంగా నివాసం ఉండడంపై పోలీసులు అరెస్ట్‌చేసి కేసు నమోదుచేశారు. అతని పాస్‌పోర్టు సీజ్‌చేసిన రేణిగుంట పోలీసులు తిరుపతి కోర్టుకు అప్పగించారు. ప్రస్తుతం ఆ కేసు విచారణలో ఉంది. ప్రస్తుతం ఈడీ అధికారుల విచారణకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,634 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,980 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తిచేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారికి క్యూలోకి అనుమతించరని స్పష్టంచేసింది.

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై వక్తృత్వ పోటీ

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జన విజ్ఞాన జాగృతి సంస్థ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప మాట్లాడారు. అలాగే ఇదే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భక్తవత్సలం, విశ్రాంత జిల్లా ఖజానా అధికారి రఫీ, హెచ్ఓడీలు డాక్టర్ పి.నాగేంద్ర, ఎం. నరసింహులు, స్టూడెంట్ అడ్వైజర్ కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధుల మందులపై పన్ను ఎత్తివేత



అవగాహన కల్పిస్తున్న ప్రసూతి వైద్యాధికారులు

తిరుపతి తుడా: స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో రోగుల సహాయకులకు బుధవారం సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ అనే అంశంపై సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల దేవి అవగాహన కల్పించారు. గతంలో 12 శాతం ఉన్న పన్నును జీరో చేయడంతో ప్రాణాంతక వ్యాధులు, క్యాన్సర్, తీవ్రమైన వైరస్-టీబీ, హెచ్ఐవీ/ఎయిడ్స్ వంటి వ్యాధులకు ఉపయోగించే మందులపై పూర్తి స్థాయి లో పన్ను ఎత్తివేశారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అనంత నిర్మలమ్మ, డాక్టర్ ఠాగూర్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీకర్, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీ ఆధారిత వైద్య సేవలు

తిరుపతి కల్చరల్: టెక్నాలజీ ఆధారిత హెల్త్ కేర్ సేవలను అందించే లక్ష్యంగా తాము ఏఏయూ హెల్త్‌కేర్ సంస్థను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ సీఈఓ వంశీకృష్ణ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నై, తిరుపతి ప్రాంతాలలో తమ సంస్థను ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన వైద్యుల కన్సల్టేషన్ సేవలను అందుబాటులోకి తెచ్చామని, ఎవరైననూ తక్కువ సమయంలో ఎక్కడ నుంచైనా నమ్మకమైన వైద్య సలహాలు పొందవచ్చన్నారు. తమ హెల్త్ కేర్‌కు ఫోన్ నంబర్ 9121081080కు మిస్డ్ కాల్ లేదా వాట్సాప్ కాల్ చేస్తే అవసరమైన వైద్య నిపుణులతో నేరుగా కనెక్ట్ అయ్యేలా తమ బృందం కృషి చేస్తుందని తెలిపారు. అలాగే తమ సంస్థ వెబ్‌సైట్‌లోనూ వైద్య సేవల వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ఎస్ఎఫ్ఐ నిరసన



తిరుపతి సిటీ: మోహన్‌బాబు వర్సిటీని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంఆర్ పల్లి కూడలిలో విద్యార్థులతో కలసి ఆందోళన చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శి రవి మాట్లాడారు. ఎంబీయూలో ఫీజుల అక్రమాలతో కోట్ల రూపాయలు వసూలు చేసి పక్కదారి పట్టించారని ఆరోపించారు. అక్రమ వసూళ్ల ఫీజులను తిరిగి విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అక్బర్, నగర కార్యదర్శి తేజ, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.